# మట్టికి మట్టి

హైదరాబాద్ విమానాశ్రయం నుండి బయట పడేసరికి ఉదయం ఆరు దాటింది. వెంటనే హోటలు చేరుకుని గది తీసుకుని, గదిలో చేరీ చేరగానే పాపక్కకు ఫోను చేశాను. వాషింగ్టన్ డి.సి. ఎయిర్‌పోర్టులో విమానం ఎక్కేముందు ఫోను చేసిన తర్వాత పాపక్కకు మళ్ళీ ఇదే ఫోను చేయడం.

"హైదరాబాద్ చేరుకుని ముప్పావుగంట అయింది. ఎయిర్‌పోర్టుకు దగ్గరలో ఉన్న హోటలులో దిగాను." అని నేను దిగిన హోటలు పేరు, గది నెంబరు చెప్పి, "అమ్మ ఏ ఆస్పత్రిలో ఉంది? రూం నెంబరెంత?" అడిగాను.

చెప్పింది.

నాకు అమ్మను వెంటనే చూడాలని ఉంది. అమ్మకు బావోలేదంటే సీరియస్ అనుకోలేదు. రెండు రోజుల కిందట పాపక్క అమ్మ ఆరోగ్యం గురించి ఫోను చేశాక వెంటనే బయల్దేరకుండా ఉండలేకపోయింది. అమ్మ అనారోగ్యంగా ఉంటున్నప్పటినుండి పాపక్క దగ్గర ఉంటోంది.

"ఇప్పుడు అమ్మకు ఎలా ఉంది? కోలుకుంటున్నట్టేనా?" అడిగాను.

"అదేం లేదు. మూడు రోజులనుండి కోమాలో ఉంది. ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ నుంచి నిన్నే వేరేగదిలోకి మార్చారు... నిజం చెప్పేదా?... బతకడం కష్టం... " నెమ్మదిగా అంది.

నా గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. ఫోను పెట్టేసి ఆస్పత్రికి వెళ్ళడానికి తయారవ్వడం మొదలెట్టాను. సంవత్సరం కిందట వచ్చినప్పుడు అమ్మ ఆరోగ్యంగా ఉంది. అప్పుడు గుంటూరులో ఉండేది. రెండు వారాలకొకసారో, మూడు వారాలకొకసారో ఫోనుచేసి మాట్లాడుతుండేవాడిని. అమ్మకు డెబ్బయి సంవత్సరాలు దాటాయి. నాన్న చనిపోయి పదేళ్ళు అవుతోంది. నాన్న పెన్షన్ వస్తుంటుంది. రెండో

ఇంటిమీద అద్దె వస్తోంది. పండగకో, పబ్బానికో ఎంతో కొంత పంపిస్తూ ఉంటాను.

అమ్మ గుంటూరులో పుట్టింది. అక్కడే పెరిగింది. స్టాల్ గర్ల్స్‌లో చదువుకుంది. టీచరుగా పనిచేసి పదవీ విరమణ చేసింది. అమ్మకు గుంటూరు అంటే ఎంతో ఇష్టం. తన చివరి రోజులు అక్కడే తీరిపోవాలన్నది ఆమె కోరిక నాతో చాలాసార్లు అంది. నవ్వేసి ఊరుకొనేవాడిని. గుంటూరులో ఆమెను చూసుకునేందుకు దగ్గరవాళ్ళు ఎవరూ లేరు. ఏ పనిమనిషీ అమ్మ దగ్గర ఎక్కువకాలం ఇమిడేవాళ్ళు కాదు. ఏ మాత్రం అశుభ్రత గిట్టేది కాదు. సర్దుకుపోయేది కాదు. పెద్ద అన్నయ్య పెద్దపల్లిలో, రెండో అన్నయ్య ఒంగోలులో, పాపక్క హైదరాబాద్‌లో స్థిరపడిపోయారు. అందరికంటే నేను చిన్నవాడిని. వాళ్లు ముగ్గురు పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. నాకు నలభయి సంవత్సరాలు నిండినా పెళ్లీ పెటాకులు లేకుండా మిగిలిపోయాను. వయసుతో పాటు నేను వాషింగ్‌టన్‌లో చేసే ఉద్యోగం ప్రతి సంబంధానికి అడ్డు వస్తోంది. నేను తెలివికలవాడినేం కాదు. అత్తెసరు మార్కులతో బి.యస్.సి. గట్టెక్కాక అదృష్టవశాత్తూ ఒక స్నేహితుడి సహాయంతో కాంట్రాక్టు పనిమీద అమెరికా వెళ్ళాను. కాంట్రాక్టు ముగియగానే మరో ఉద్యోగంలో చేరాను. మూడు నాలుగు ఉద్యోగాలు మారాక చివరకు సూపర్ మార్కెట్‌లో స్థిరపడ్డాను. గ్రీన్‌కార్డు వచ్చింది. సిటిజన్‌షిప్ రావడానికి సమయం పడుతుంది. ఎవరయినా నన్ను చేసుకోదలిస్తే గ్రీన్‌కార్డు కోసం తప్ప మరి దేనికీ కాదు. ఇన్నేళ్ళు గడిచాక నాకు పెళ్ళి మీద ఆసక్తి పోయింది. ఒంటరి జీవితం ఎంతో ఆనందంగా, ఆసక్తికరంగా ఉన్నట్టనిపిస్తోంది.

ఆస్పత్రికి చేరుకున్నాను. నేను దిగిన హోటలుకు చాలా దూరంలో ఉంది. టాక్సీలో చేరుకోడానికి ముప్పావు గంట పయిగానే పట్టింది. పాపక్క వాళ్ళింటికి అంత దూరమేమీ లేదు. అన్ని గదులు అగ్గిపెట్టెల్లా ఒక్కలా ఉన్నాయి. గది నెంబరు ఒకసారి మననం చేసుకుంటే తలుపు నెట్టాను. చప్పుడు కాకుండా తెరుచుకుంది. గది చల్లగా ఉంది. తలుపు మూసి గది మధ్యలో ఉన్న మంచం దగ్గరకు వచ్చాను.

అమ్మ కళ్ళు మూసుకుని ఉన్నాయి. తల మీద జుట్టు పలచబడింది. ముఖం ప్రశాంతంగా ఉంది. గది మరణమంత నిశ్శబ్దంగా ఉంది. దిండు పక్కనే బైబిలు ఉంది. గడిచిన సంవత్సరానికీ, ఇప్పటికీ మనిషి సగానికి సగమయి ఉంది. ముక్కుకు ఆక్సిజన్ ట్యూబు పెట్టి ఉంది. చేతి, కాలి సిరలు దొరకలేదేమో మెడ పక్కగ సిరకు

సెలయిన్ కనక్షన్ ఇచ్చారు. మంచం వెనక ఉన్న మానిటర్‌లో గ్రాఫ్ పచ్చగా కదులుతోంది.

నేను గదిలోకి వచ్చిన చప్పుడుకు అమ్మ మంచం పక్కగా ఉన్న కుర్చీలో కూర్చున్న పాపక్క కొడుకు జయకర్ లేచి, చేతిలోని దినపత్రిక మడిచి, "ఎప్పుడొచ్చారు?" అడిగాడు.

చెప్పి, వాడి భుజం మీద చేయివేసి, "ఉదయాన్నే డాక్టరు రౌండ్స్‌కు వచ్చాడా?" అడిగాను.

"చిన్న డాక్టరు వచ్చాడు. పదకొండు దాటితేనే గాని పెద్దడాక్టరు రాడు.. అమ్మమ్మ పరిస్థితి ఏం బావోలేదు."

"రాత్రి అమ్మమ్మ దగ్గర నువ్వే ఉన్నావా?"

"తప్పుతుందా మరి?"

"టిఫిను చేశావా?"

"చేయలేదు, మీరు చేశారా?"

"చేయాలని లేదు, నువ్వు బయటకు వెళ్ళి టిఫిను చేసి వస్తూ ఆ ఫ్లాస్కులో నాకోసం కాఫీ పట్టుకురా."

జయకర్ ఫ్లాస్కు అందుకుని చొక్కా జేబులోంచి ఆస్పత్రి బిల్లు నాకు అందించాడు. చూశాను. అంతటి కిందటి రోజుతో యాభయి రెండువేల చిల్లరయింది. చిన్నగా నవ్వి, "మీరొస్తే అమ్మ మీకివ్వమంది." అన్నాడు.

"నేను కడతానులే." అని బిల్లు బైబిలు కింద పెట్టాను. అమెరికాలో నేను లక్షలకు లక్షలు సంపాయిస్తున్నానని మా వాళ్ళ నమ్మకం. ఈ సంగతి ముందుగానే ఊహించి, ఎటుపోయి ఎటువస్తుందేమోనని ఎక్కువ డబ్బులతోనే వచ్చాను.

"నేను వెళ్ళి కాఫీ తీసుకువస్తాను" కదిలాడు.

మంచం మీద  కూర్చుని అమ్మ కుడిచేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను. హఠాత్తుగా ఏదో గుర్తు వచ్చినట్లు "మాట" అన్నాను.

జయకర్ గది తలుపు దగ్గరకు వెళ్ళబోతూ ఆగాడు.

"పెద్దపల్లి, ఒంగోలు మామయ్యలు వచ్చారా?"

"ఊహు... రాలేదు.  అమ్మ ఫోనుచేస్తే, పెద్ద మామయ్యేమో తనకు స్పాట్ వేల్యుయేషన్ పని పడిందని, చిన్న మామయ్యేమో ఇంటికి స్లాబ్ వేయించుకుంటున్నానని, రావడం కష్టమని, అయినా ఇప్పుడొచ్చి తాము చేసేదేమీ ఉండదని,

ఏదయినా అయితే వెంటనే ఫోను చేయమని చెప్పారు. తలనొప్పంతా అమ్మకే చుట్టుకున్నట్టుంది".

దుఃఖాన్ని గొంతు నుండి బయటకు రానీయకుండా, "నేను వచ్చాను కదరా" అన్నాను.

జయకర్ వెళ్ళిపోయాక అమ్మ ముఖంలోకి చూస్తూ చేయి నిమరడం మొదలెట్టాను. అమ్మ స్పృహలోకి వస్తుందని నాకు నమ్మకంగా ఉంది. ఇంట్లో అందరికంటే చిన్నవాడినని అమ్మ నన్ను ఎంతో ప్రేమగా చూసుకునేది. మా అన్నయ్యలకు, పాపక్కకు తెలియకుండా తినడానికి చిన్నప్పుడు ఏదయినా తయారుచేసో, కొనో దాచిపెట్టి నాకిచ్చేది. అయినా ఎలాగోలా వాళ్ళకు తెలిసి పోతుండేది. ఆ సంగతి పాపక్క ఇప్పటికి నన్ను దెప్పి పొడుస్తూ ఉంటుంది.

"అమ్మా" పిలిచాను.

కదిలినట్టు అనిపించింది. కోమాలో ఉన్న వాళ్ళు కదులుతారో, లేదో నాకు తెలియదు.

"అమ్మా" మళ్ళీ పిలిచాను.

"ఊ" అంది.

స్పృహలోకి వస్తోంది. నా ఆనందానికి అంతులేదు. మంచం దిగి నిలబడి మళ్ళీ పిలిచాను. నా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. నుదురుమీద ముద్దు పెట్టుకున్నాను.

"నిన్ను చూస్తానని అనుకోలేదురా" కళ్ళల్లో నీళ్ళు తిరుగుతోంటే అంది.

అమ్మ చివరి చూపులు అందుకుంటానని, మాట్లాడతానని అనుకోలేదు. నేను వచ్చేసరికి అంతా అయిపోయి ఉంటుందని అనుకున్నాను. అమ్మ చేతులు గట్టిగా పట్టుకున్నాను. చేతులు చిన్నగా వణుకుతున్నాయి. నన్ను ఎత్తుకుని అల్లారుముద్దుగా పెంచిన చేతులవి. దుఃఖం ఆగడం లేదు. అమ్మ కళ్ళల్లో నీళ్ళు నిలవడంలేదు.

ఉద్వేగం తగ్గాక రుమాలుతో కళ్ళనీళ్లు తుడుచుకుంటోంటే, "ఎప్పుడొచ్చావురా?' అడిగింది. ఈసారి మాటలు స్పష్టంగా ఉన్నాయి.

"ఉదయాన్నే వచ్చాను."

"పోయిన వారం మీ ఫ్రెండు పాస్టరు సంజీవరావుగారు వచ్చి అరగంటేమో కూర్చుని ప్రార్థన చేసి వెళ్ళాడు. మళ్లీ వస్తానన్నాడు. రాలేదు."

"ఇవేళ రమ్మని కబురంపుతానమ్మా. నీకు పూర్తిగా నయం అయ్యేవరకూ నీ దగ్గరే ఉంటాను. ఆయన్ని రోజూ రమ్మంటాను" అంటూ అమ్మ కన్నీళ్ళు తుడిచాను. అమ్మ ముఖం సంతోషంతో వెలుగుతోంది.

"నీ ప్రయాణం బాగా జరిగిందా?"

"జరిగిందమ్మా."

కొద్దిసేపు కళ్ళు మూసుకుని, "ఇక్కడి నుండి ఎంత దూరం?" అడిగింది.

నేను ప్రయాణం చేసిన దూరం అడుగుతుందనుకుని, "పదిహేను వేల కిలోమీటర్ల పయినే ఉంటుందమ్మా. ఇరవయిరెండు గంటల ప్రయాణం. ..." అంటోంటే నా మాటలకు అడ్డు తగిలి, తల అడ్డంగా ఆడించి, కళ్ళు తెరిచి, "నేనడిగింది అది కాదురా. ఇక్కడి నుండి సమాధుల తోట ఎంత ధూరం ఉంటుందిరా అని అడుగుతున్నాను.. నన్ను తీసుకువెళ్ళడానికి మీకేం ఇబ్బంది ఉండదు కదా?" అంది.

అవే అమ్మ చివరి మాటలు.

(నా తల్లి అందుగల (బండారు) గ్రేస్ మనోరమా కిన్సింగర్ స్మృతికి)

❖ రచన, ఆదివారం వార్త, 11మే, 2008